క్లుప్తంగా

విశ్వబ్రాహ్మణులకు కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలి



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న విశ్వబ్రాహ్మణులు

మేడ్చల్: పట్టణంలో విశ్వబ్రాహ్మణుల సంఘానికి కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని విశ్వబ్రాహ్మణులు మంత్రి మల్లారెడ్డిని కోరారు. బీఆర్ఎస్ నాయకులతో కలిసి విశ్వబ్రాహ్మణుల సంఘం నాయకులు మంత్రి మల్లారెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. మేడ్చల్‌లో సంఘానికి కమ్యూనిటీ హాల్ మంజూరు చేసి, నిర్మాణానికి నిధులు ఇవ్వాలని కోరారు. విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు విష్ణుచారి, సత్యనారాయణచారి, శ్రీధర్‌చారి, వెంకటేష్‌చారి, బీఆర్ఎస్ నాయకులు నర్సింహారెడ్డి, శేఖర్‌గౌడ్, సత్యనారాయణ, నవీన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మేడ్చల్‌లో బీజేపీ నాయకుల రాస్తారోకో



మేడ్చల్‌లో రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్టును నిరసిస్తూ మేడ్చల్‌లో బీజేపీ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. పట్టణంలో 44వ జాతీయ రహదారిపై నాయకులు రాస్తారోకో చేసి తమ నిరసన తెలిపారు. అనంతరం పోలీసులు బీజేపీ నాయకులను అరెస్ట్ చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సేఫ్టీకిట్స్

బోడుప్పల్: 13వ డివిజన్‌లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం స్థానిక కార్పొరేటర్ దానగల్ల అనిత యాదగిరి సేఫ్టీకిట్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం పారిశుద్ధ్య పనులు నిర్వహించడంలో వీరి పాత్ర కీలకమైందన్నారు. వారికి సబ్బులు, నూనెలు, మాస్కులు, రెయిన్‌కోట్లను పంపిణీ చేశారు. నగర పాలక సంస్థ అభివృద్ధి తమవంతు సహకారం అందజేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చదువు, క్రీడలూ రెండూ ముఖ్యమే..

బోడుప్పల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించేందుకు కృషి చేయాలని పల్లవి మోడల్ స్కూల్ డైరెక్టర్ సుశీల్ కుమార్ అన్నారు. హరిద్వార్‌లో జరిగిన 12వ సబ్ జూనియర్ జాతీయ డ్రాప్ రోబాల్ చాంపియన్‌షిప్‌లో పల్లవి మోడల్ స్కూల్ విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచి సిల్వర్ మెడల్స్ సాధించగా వారిని ఆయన అభినందించారు. పోటీల్లో పాల్గొన్న ప్లేయర్లు రణదీప్‌రెడ్డి, రుత్విక్‌రెడ్డి, అద్వైత్‌రెడ్డి, శివ ప్రతీక్, ప్రభాస్, మారియ రవీంచి, సాయిసంకల్ప, సాత్విక్, శుక్రమ్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ తనూజ, కోచ్‌లు సురేందర్, రెహమాత్ పాల్గొన్నారు.

మన ఆరోగ్యం..మన బాధ్యత

మల్కాజిగిరి: మన ఆరోగ్యం మన బాధ్యతగా గుర్తించాలని ఆర్యవైశ్య సంఘం నాయకులు ప్రభుగుప్త, సుధాకర్‌గుప్త అన్నారు. బుధవారం ఓల్డ్ మల్కాజిగిరి కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో ధ్యాన యోగా శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఒత్తిడితో ఉన్న జీవనాన్ని గడపుతూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించలేకపోతున్నామని అన్నారు. ధ్యానం, యోగాతో ఒత్తిడిని దూరం చేసుకోవడమే కాకుండా రోగాలు రాకుండా చేసుకోవచ్చన్నారు. 15 రోజులు తరగతులు ఉంటాయని యోగా గురువు గణపతి తెలిపారు. వివరాలకు ఫోన్: 90148 92969.

11న బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

కాప్రా: బీఆర్ఎస్ ఏఎస్‌రావునగర్ డివిజన్ ఆత్మీయ సమ్మేళనం ఈ నెల 11న నిర్వహించనున్నట్లు ఆ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కాసం మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఏఎస్‌రావునగర్ ఓమోజీ బాబా కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించే ఆత్మీయ సమ్మేళనానికి పార్టీ శ్రేణులంతా భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి హాజరవుతారని అన్నారు.



ఘట్‌కేసర్‌లో నివాళులర్పిస్తున్న చైర్ పర్సన్ పావనీయాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



అవుషాపూర్‌లో నివాళులర్పిస్తున్న సర్పంచ్ కావేరి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి



జవహర్‌నగర్‌లో నివాళులర్పిస్తూ..

మహనీయుడు.. జగ్జీవన్‌రామ్..



జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో మేయర్ కావ్య, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, కమిషనర్ రామలింగం తదితరులు

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పోరాడిన మహనీయుడు బాబు జగ్జీవన్ రామ్ అని పలువురు కొనియాడారు. బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా బుధవారం మేడ్చల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక నేతలు, ఆయా కాలనీల వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



గుండ్లపోచంపల్లిలో మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ రాములు తదితరులు



డబీల్‌పూర్‌లో ఎంపీపీ రజితరెడ్డి తదితరులు



మూడుచింతలపల్లిలో..



మునీరాబాద్‌లో సర్పంచ్, ఉపసర్పంచ్, నాయకులు



మేడ్చల్‌లో నివాళులర్పిస్తున్న నేతలు



చీర్యాల మల్లన్న దేవాలయం వద్ద ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ

రాష్ట్రంలో అరాచకపాలన

బండి సంజయ్ అరెస్టుపై బీజేపీ నేతల ధర్నా



కీసరలో బీఆర్ఎస్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నేతలు

కీసర: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్టును నిరసిస్తూ బీజేపీ నేతలు నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీలతో పాటు మండల కేంద్రమైన కీసరలో పెద్దఎత్తున నిరసన, ధర్నాలు చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కొంపల్లి మోహన్‌రెడ్డి, సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచకపాలన కొనసాగుతోందని, పోలీసులు బీఆర్ఎస్ ప్రభుత్వానికి, సీఎం కేసీఆర్‌కు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజల నుంచి బీజేపీకి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే బీజేపీ నేతలపై బీఆర్ఎస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టిస్తోందని విమర్శించారు. ప్రధానమంత్రి పర్యటనను దెబ్బతీసేందుకు బీఆర్ఎస్ చేస్తున్న కుట్రలో భాగమే బండి సంజయ్ అరెస్టు అని, ఎన్ని అరెస్టులు, అక్రమ కేసులు పెట్టినా ప్రధాని పర్యటనను ఆపలేరని, పెద్ద ఎత్తున విజయవంతం చేస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. బీజేపీ నేతలు నల్ల వెంకట్‌రెడ్డి, కొలబాల్‌రాజ్, బండారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లాల తిరుమల్‌రెడ్డి, కొలిచెలిమి కృష్ణ, లక్ష్మీ, రాగుల అశోక్ గాలి సంపత్‌యాదవ్ తదితరులు బొమ్మలరామారం వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అరెస్టు చేసి వారిని కీసర పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి



ఘట్‌కేసర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

ఘట్‌కేసర్: బీఆర్ఎస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని, ప్రభుత్వం అరెస్ట్ చేయించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ని వెంటనే విడుదల చేయాలని బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు హనుమాన్, మండల అధ్యక్షుడు ప్రవీణ్‌రావు, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. బండి సంజయ్ అరెస్టుకు నిరసనగా పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీజేపీ మున్సిపల్, మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, సీఎం కేసీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర నేత ఆంజనేయులుగౌడ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శులు రామతీర్థ, శ్రీశైలం, రవీందర్‌రెడ్డి, బీజేపీ మున్సిపల్ ఉపాధ్యక్షుడు నరేశ్‌ముదిరాజ్, రాజశేఖర్‌రెడ్డి, ఉదయ్, రఘు, వీరేశం, వెంకటేశ్, రాంమోహన్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు



బీజేపీలో చేరిన వారితో ఈటల రాజేందర్

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ మున్సిపాలిటీకి చెందిన పలువురు నాయకులు, ఉద్యమకారులు బుధవారం బీజేపీ చేరిక కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు విక్రంరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని పూడూర్ గ్రామ పరిధిలోని ఈటల నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేడ్చల్‌కు చెందిన ఉద్యమకారుడు సుధాకర్‌తో పాటు పలువురికి ఈటల రాజేందర్ పార్టీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ఆంజనేయులు, నరేందర్‌రెడ్డి, కృష్ణగౌడ్, సర్వేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామిని పూజిస్తే అన్ని శుభాలే..

– డిప్యూటీ మేయర్ శ్రీనివాస్

జవహర్‌నగర్: అయ్యప్ప స్వామిని పూజిస్తే అన్ని శుభాలే కలుగుతాయని జవహర్‌నగర్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్, అయ్యప్ప స్వామి దేవాలయ చైర్మన్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ అన్నారు. అయ్యప్ప స్వామి జన్మదినాన్ని పురస్కరించుకొని జవహర్‌నగర్‌లోని అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో అభిషేకాలు, మెట్లపూజ, గణపతి హోమం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గొడుగు వేణు, నాయకులు మహేష్, శ్రీనాథ్, ప్రసాద్, రాజశేఖర్‌చారి, వెంకటచారి, సురేష్, భిక్షపతి, శ్రీను, వెంకటేష్, గణేష్, మహేష్, నాగరాణి, మౌనిక, మాధవి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అయ్యప్ప స్వామి ఆలయంలో పూజల్లో డిప్యూటీ మేయర్ శ్రీనివాస్

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: పట్టణంలోని 17వ వార్డుకు చెందిన ముగ్గురికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన ఆర్థిక సాయం చెక్కులను మంత్రి మల్లారెడ్డి అందజేశారు. వార్డుకు చెందిన మహమ్మద్ షరీఫ్‌కు రూ.28 వేలు, మల్లేష్‌కు రూ.25 వేలు, జయమ్మకు రూ.30 వేల ఆర్థిక సాయం చెక్కులు మంజూరుకావడంతో ఆ చెక్కులను మంత్రి మల్లారెడ్డి తన నివాసంలో అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అర్చన సందీప్‌గౌడ్, నర్సింహస్వామియాదవ్, వైస్ చైర్మన్ రమేష్, నాయకులు లాయక్ అలీ, మధుకర్‌యాదవ్, మహేష్‌యాదవ్, సాయి, విజయరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఘన సత్కారం



విద్యార్థులను అభినందిస్తూ..

కీసర: నాగారం మున్సిపాలిటీకి చెందిన విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం అభినందనీయమని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. ఇటీవల రాజస్థాన్‌లో జరిగిన జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించిన వైష్ణవి, చరణ్‌వంశీతేజ్, కాంస్య పతకాలు సాధించిన షణ్ముఖప్రియ, ఎ.కృష్ణను ఘనంగా సత్కరించారు. టైగర్ క్లబ్ తైక్వాండో అకాడమి కోచ్ శివకుమార్ అభినందించారు. కార్యక్రమంలో కౌన్సెలర్ బిజ్జ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు అండ



ఆర్థిక సాయం అందజేస్తున్న కుమార్, శంకర్, చిరంజీవి

ఘట్‌కేసర్: ఏదులాబాద్‌లో ఇటీవల మరణించిన మృతుల కుటుంబాలకు మల్లారెడ్డి ట్రస్ట్ అండగా నిలిచింది. మృతి చెందిన శాంతమ్మ, బాలయ్య కుటుంబ సభ్యులను మాజీ ఎంపీటీసీ కుమార్‌ముదిరాజ్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శంకర్, చిరంజీవి ముదిరాజ్ బాధితులను పరామర్శించారు. అనంతరం ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున రూ.10 వేలను అందజేశారు. ట్రస్ట్ ఇన్‌చార్జి వేణు, వెంకటేశ్, మహేశ్ ఉన్నారు.

మల్కాజిగిరి ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి శంకుస్థాపన

అల్వాల్: జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. బుధవారం నేరేడ్‌మెట్‌లోని రాచకొండ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం వెనుక సర్వే నెంబర్-278లో మల్కాజిగిరి ప్రెస్‌క్లబ్ నూతన భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మల్కాజిగిరి మండల పరిధిలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ప్రెస్‌క్లబ్ భవనం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి అందరి సహకారం అందిస్తామన్నారు. తనవంతు సాయంగా రూ.5 లక్షలను ప్రకటించారు. బీఆర్ఎస్ నేత జీఎన్‌వీ సతీష్‌కుమార్ నిర్మాణానికి అవసరమైన సహకారం అందించాలని సూచించారు. కార్పొరేటర్‌లు ప్రేమ్‌కుమార్, సునీత రాముయాదవ్, నాయకులు ప్రభాకర్‌గౌడ్, ఉపేందర్‌రెడ్డి, గుండా నిరంజన్, జీఎన్‌వీ సతీష్‌కుమార్, పట్టీల శ్రీనివాస్, ప్రసాద్, బుజ్జి, నర్సింగ్, ఆగమయ్య, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

పెరటి కోళ్లకు టీకాలు



చీర్యాల గ్రామంలో టీకాలు వేస్తూ..

కీసర: గ్రామాల్లో పెరటి కోళ్లకు కొక్కెర(ఆర్‌డీ) వ్యాధి నివారణకు టీకాలను వేస్తున్నామని కీసర మండల పశువైద్యాధికారి డాక్టర్ శ్యామల తెలిపారు. ఈ మేరకు చీర్యాల గ్రామంలో పెరటి కోళ్లు పెంచుతున్న ఇళ్ల వద్దకు చేరుకొని టీకాలు వేసే కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శ్యామల మాట్లాడుతూ టీకాలు వేసిన కోళ్లకు ఏడాది పాటు వ్యాధి రాకుండా టీకా పనిచేస్తుందన్నారు.

9న కమ్యూనిస్టుల సమ్మేళనం

కాప్రా: ప్రజా సమస్యల పరిష్కారానికి కమ్యూనిస్టుల ఐక్యత ఆవశ్యకమని సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి దామోదర్ అన్నారు. ఉప్పల్ మండలం సీపీఐ ముఖ్యకార్యకర్తల సమావేశం బుధవారం ఏఎస్‌రావునగర్‌లోని నీలం సంజీవరెడ్డి భవన్‌లో నిర్వహించారు. సమావేశానికి హాజరైన దామోదర్ మాట్లాడుతూ.. హైదరాబాద్ నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈ నెల 9న కమ్యూనిస్టుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల, జిల్లా, రాష్ట్రస్థాయి నేతలంతా పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ నేతలు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రజాసమస్యల పరిష్కారానికి సీపీఐ, సీపీఎం సంయుక్తంగా నిర్వహించే ఈ సమ్మేళనానికి రాష్ట్ర, జాతీయ ముఖ్య నేతలు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సమ్మేళనం రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులకు సంకేతమవుతుందని స్పష్టం చేశారు. రాష్ట్ర రాజకీయాల్లో కమ్యూనిస్టులు కీలకపాత్ర పోషించి తమ బలాన్ని పెంచుకుంటూ ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు శంకర్‌రావు, రామ్‌నారాయణ, లక్ష్మీనారాయణ, నర్సింహ, సాంబశివరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.